క్లుప్తంగా

సర్పంచ్‌కు మంత్రి పరామర్శ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అనంతసాగర్ సర్పంచ్ చామకూర విజయ అత్త, మాజీ సర్పంచ్ చామకూర లింగం తల్లి ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న మంత్రి హరీశ్‌రావు శుక్రవారం సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. మంత్రి వెంట బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, తదితరులు ఉన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి


వినతి పత్రం ఇస్తున్న నాయకులు

హుస్నాబాద్: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ పట్టణంలో వేసిన అక్రమ లేఅవుట్లు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లిఖార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం రెవెన్యూ డివిజన్ కార్యాలయ అధికారి భిక్షపతికి వినతి పత్రం ఇచ్చారు. భూ వ్యాపారులు ఎక్కువ మొత్తంలో వ్యవసాయ భూములను కొనుగోలు చేసి అక్రమ వెంచర్లు చేసి ప్రజలను నమ్మించి క్రయ విక్రయాలు జరుపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండికొడుతున్నారన్నారు. మున్సిపల్ పాలకవర్గం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గట్టు సాయి, బదుగు రమేశ్, గాదాసు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫోన్ హ్యాక్‌చేయడం దుర్మార్గం


తొగుటలో మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

తొగుట(దుబ్బాక): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఫోన్ హ్యాక్ చేయడం దుర్మార్గపు చర్యని బీఎస్పీ దుబ్బాక అధ్యక్షుడు జింక సంజీవ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఎస్పీకి లభిస్తున్న ప్రజాదరణ చూసి రాష్ట్ర ప్రభుత్వం తట్టుకోలేకపోతోందన్నారు. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలు రాజ్యాధికారం దిశగా అడుగులేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ అధికారంలోకి రావడంఖాయమని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ప్రదాన కార్యదర్శి పర్స రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): సీఎంఆర్ఎఫ్ పేదల పాలిట వరమని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రానికి చెందిన పుల్లన్నగారి మణిదీప్, పొన్నబోయిన నవదీప్‌లకు సీఎం సహాయ నిధి నుంచి రూ.3 లక్షల చొప్పున 2 చెక్కులను ప్రభుత్వం విడుదల చేసింది. వాటిని లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యం చేయించుకోలేని పేదలకు సీఎంఆర్ఎఫ్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూప రాణి, వైస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్ చంటి, నాయకులు బాల్‌నర్సయ్య, యాదగిరి, అంజయ్య, గిరిదర్ తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిని శిక్షించాలి

సిద్దిపేటకమాన్: నిజామాబాద్ జిల్లా కోటగిరిలో టీచర్ మల్లికార్జున్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. టీచర్‌పై దాడిని నిరసిస్తూ సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో ప్లకార్డులతో శుక్రవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో సత్తయ్య, మహేష్, విశ్వనాథ్, సందీప్, పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: ఉపాధ్యాయుడిని కులం పేరుతో దూషించిన వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు చిప్పల యాదగిరి డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌ను అవమానించినవారిని కఠినంగా శిక్షించాలన్నారు.

నామ ఫలకం ఆవిష్కరణ

హుస్నాబాద్: పట్టణంలోని 14వ వార్డు మూడవ వీధి నామ ఫలకాన్ని శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆవిష్కరించారు. మూడో వీధికి హరిహర నగర్ పేరుపెట్టారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ హరిహరనగర్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు భూక్య సరోజన, హరీశ్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కో ఆప్షన్ సభ్యుడు అయూబ్, కాలనీ వాసులు తిప్పర్తి చంద్రమౌళి, కుమార్, గంగిశెట్టి మహేశ్, దినేశ్, శ్రీనివాసచారి, భరత్, సాయికిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కీమ్‌ల ప్రైవేటీకరణ నిలిపివేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాల స్వామి


మిరుదొడ్డిలో తహసీల్దార్ ఉదయశ్రీకి వినతి పత్రం అందిస్తున్న ఆశ వర్కర్లు

మిరుదొడ్డి(దుబ్బాక): కేంద్ర ప్రభుత్వం స్కీంల ప్రైవేటీకరణను నిలిపి, కేంద్ర బడ్జెట్‌ను పెంచే దిశగా చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాల స్వామి డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి తహసీల్దార్ కార్యాలయాల వద్ద శుక్రవారం అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ఆందోళన చేపట్టారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను తహసీల్దార్లు ఉదయశ్రీ, వీరేశ్‌లకు అందించారు.కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు, అంగడన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): స్కీం వర్కర్లను గుర్తించాలని దేశ వ్యాప్తంగా తలపెట్టిన నిరసనలో భాగంగా శుక్రవారం పలువురు స్కీం కార్మికులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఆరీఫాకు వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. వారిని చట్ట పరిధిలోకి తేవడానికి నిరాకరిస్తుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తన పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యంవహిస్తుందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా కోటి మంది పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్కీం వర్కర్లు రేణుక, కవిత, లక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

తొగుట(దుబ్బాక): స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ కేంద్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు మేలుచేసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం దారుణమన్నారు. ఆ సంస్థలకు రూ.కోట్లలో పన్నుల రాయితీ ఇస్తోందని ఆరోపించారు. పేదల సంక్షేమ పథకాల నిధుల్లో కోత విధిస్తోందని ఆరోపించారు. స్కీం వర్కర్లకు అదనపు పనికి అదనపు వేతనవ చెల్లించాలని డిమాండ్ చేశారు.

దుబ్బాకటౌన్: స్కీంల ప్రైవేటీకరణ విధానం రద్దు చేసి. స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.భాస్కర్ డిమాండ్ చేశారు.శుక్రవారం దుబ్బాక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని అంగన్‌వాడీ సీఐటీయూ కార్యవర్గ సభ్యురాలు లక్ష్మీ మండిపడ్డారు. శుక్రవారం దౌల్తాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆశ, అంగన్ వాడీ తదితర స్కీమ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించకుండా కేంద్ర ప్రభుత్వం వారిని మోసం చేస్తోందని ఆరోపించారు.

గజ్వేల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాల ప్రైవేటీకరణను ఆపాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్ తహసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఐసీడీఎస్, ఎన్‌హెచ్ఆర్ఎం, మధ్యాహ్న భోజనం, ఎన్ఆర్ఈజీఎస్ పథకాలను ప్రైవేటీకరించడం సరికాదన్నారు.

మల్లన్న సాగర్ నీటితో చెరువులు నింపాలి

ఎంపీ ప్రభాకర్‌రెడ్డిని కలిసిన కాన్గల్ రైతులు


ఎంపీ ప్రభాకర్‌రెడ్డితో రైతులు

తొగుట(దుబ్బాక): యాసంగి పంటలు ఎండిపోకుండా మల్లన్న సాగర్ నీటితో చెరువులు నింపాలని కాన్గల్ రైతులు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఎంపీని రైతులు కలిశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టంతో వరి సాగు విస్తీర్ణం బాగాపెరిగిందన్నారు. మండలంలో పెద్దఎత్తున వరి నాట్లు వేస్తున్నారని చెప్పారు. గతంలో యాసంగిలో పంటలు ఎండిపోకుండా కూడవెల్లి వాగులోకి మల్లన్న సాగర్ జలాలను వదిలారని గుర్తు చేశారు. ఈసారి కూడా మండలంలోని వరి పంటలను రక్షించేందుకు చెరువులు, కుంటల్లోని నీటిని నింపాలని విజ్ఞప్తి చేశారు. దుబ్బాక నియోజవకర్గ రైతులు వరి సాగుచేపట్టిన విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకుపోతామని ఎంపీ రైతులకు హమీనిచ్చారు. విత్తనాలు, ఎరువులు కొరత రాకుండా సీఎం చర్యలు తీసుకున్నారని చెప్పారు. రైతులు ధైర్యంగా పంటలు సాగుచేసుకోవాలని భరోసానిచ్చారు. కేంద్ర ప్రభుత్వం సహకరించకున్నా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. ఎంపీని కలిసిన వారిలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, రైతులు లక్ష్మీనారాయణ, చంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, కనకయ్య ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

జనగామ నియోజకవర్గ పాలక్ గట్టు శ్రీకాంత్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): బీజేపీని బూత్ స్థాయిలో బలోపేతం చేసే దిశగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని జనగామ నియోజకవర్గ పాలక్ గట్టు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వీరభద్ర గార్డెన్‌లో జనగామ నియోజకవర్గ పరిధిలోని చేర్యాలతో పాటు నాలుగు మండలాల శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, నాయకుల సమావేశం జరిగింది. శనివారం జరిగే మహబూబ్ సమ్మేళనానికి అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, నాయకులు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేష్‌గౌడ్, జనగామ జిల్లా అధ్యక్షుడు దశమంతారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కెవిఎల్ఎన్ రెడ్డి, నియోజకవర్గ పాలక్ గట్టు శ్రీకాంత్‌రెడ్డి, జనగామ నియోజకవర్గ కన్వీనర్ బల్ల శ్రీనివాస్, నియోజకవర్గ ప్రచారి హరిచంద్రగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి 12 ఎగ్జిబిట్స్ ఎంపిక


మహ్మద్ అహ్మద్ ఫహీమ్‌ను అభినందిస్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పట్టణంలో జరిగిన టీఎల్ఎం మేళాలో గజ్వేల్ మండల పరిధిలోని 47 పాఠశాలలకు చెందిన 150 మంది ఉపాధ్యాయులు తాము రూపొందించిన ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉర్దూ మీడియం నుంచి 2 ఎగ్జిబిట్స్‌తో పాటు తెలుగు మీడియంలో ఒక్కో సబ్జెక్టు నుంచి మూడు ఎగ్జిబిట్స్ చొప్పున (తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఈవీఎస్) మొత్తం 12 ఎగ్జిబిట్స్ జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి. జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపికైన ఎగ్జిబిట్స్‌ను రూపొందించిన ఉర్దూ మీడియం ఉపాధ్యాయుడు మహ్మద్ అహ్మద్ ఫహీమ్‌తో పాటు జిల్లా స్థాయికి ఎంపికైన ఉపాధ్యాయులను ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మద్దూరు(హుస్నాబాద్): పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తహసీల్దార్ భూపతి అన్నారు. శుక్రవారం మండలంలోని లక్కపల్లి గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. వివిధ కారణాలతో డిజిటల్ సిగ్నేచర్ (డీఎస్)పెండింగ్‌లో ఉన్న సర్వే నంబర్‌లో సంబంధిత రైతులు అప్రూవల్ కోసం మీసేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా 300 మంది రైతులు డీఎస్ పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు.

టీఎల్ఎం మేళాతో ప్రయోజనం

మద్దూరు(హుస్నాబాద్):టీఎల్ఎం మేళాతో విద్యార్థులకు ప్రయోజనం లభిస్తుందని సర్పంచ్ దుబ్బుడు దీపిక వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దూల్మిట్ట మండల కేంద్రంలో టీఎల్ఎం మేళా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. టీఎల్ఎంతో విద్యాబోధన సులభమవుతుందన్నారు. బోధనోపకరణాలతో చదువుపై విద్యార్థులకు ఆసక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నర్సింహారెడ్డి, ఉపసర్పంచ్ పోతురాజు మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

8న పద్మశాలి సమాజం జిల్లా కమిటీ ప్రమాణస్వీకారం

సిద్దిపేటకమాన్:ఈనెల 8వ తేదీన సిద్దిపేట పట్టణంలోని వడ్డేపల్లి దయానంద్ ఫంక్షన్ హాల్‌లో పద్మశాలి సమాజం సిద్దిపేట జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు పద్మశాలి సమాజం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సతీష్ తెలిపారు. శుక్రవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నాయకులు మాట్లాడారు. పద్మశాలి సమాజం జిల్లా కమిటీ గడువు ముగియడంతో నూతన అధ్యక్షుడిగా డాక్టర్ సతీష్‌ను తిరిగి ఎన్నుకున్నామని తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తదితర ప్రముఖులు హాజరవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మల్లేశండాక్టర్ దేవేందర్, కోశాధికారి డాక్టర్ స్వామి, పట్టణ అధ్యక్షుడు రాజేశం, శ్రీశైలం, ప్రచార కార్యదర్శి ముదిగొండ శ్రీనివాస్, వెంకన్న, భిక్షపతి, హనుమంతు ు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించాలి


వాటర్ ప్లాంట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

చేర్యాల(సిద్దిపేట): కొన్ని నెలలుగా మూసి ఉన్న వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించాలని కోరుతూ మండల పరిదిలోని కడవేర్గు గ్రామస్తులు శుక్రవారం వాటర్ ప్లాంట్ ఎదుట ఖాళీ బిందెలతో ఆందోళనకు దిగారు. ఆందోళనకు మద్దతు తెలిపిన సీపీఎం మండల కమిటీ సభ్యుడు కత్తుల భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. పది నెలలుగా వాటర్ ప్లాంట్ మూసి వేయడంతో గ్రామస్తులు ఇబ్బందిపడుతున్నారన్నారు. పాడైన వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్లాంట్ మరమ్మతులకు ఇప్పటికే లక్షలలు ఖర్చు చేసినట్లు బిల్లులు తీసుకున్నారే తప్ప వాటర్ ప్లాంట్‌ను బాగు చేయించలేదని ఆరోపించారు. ఈ విషయాన్ని అనేకమార్లు సర్పంచ్, కార్యదర్శి, ఎంపీఓ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. వాటర్ ప్లాంట్‌ను పునరుద్దరించి మరమ్మతుల కోసం ఖర్చు చేసిన డబ్బును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఖజానా శాఖ ఉద్యోగుల కార్యవర్గ సమావేశం

సిద్దిపేటజోన్: తెలంగాణ సాధించిన తర్వాత ఉద్యోగులు ఎంతో కష్టపడి పనిచేశారని, అదే స్ఫూర్తితో పనిచేద్దామని జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి విక్రమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం పబ్లిక్ సర్వెంట్స్ హోంలో తెలంగాణ ఖజానా శాఖ ఉద్యోగుల కార్యవర్గ సమావేశం జరిగింది. ఉద్యోగుల హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ అధికారి బాలరాజు, ప్రతినిధులు సురేందర్ రెడ్డి, సంపత్, లింగం , సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ల ఆవిష్కరణ

సిద్దిపేటజోన్: తెలంగాణ మెడికల్, హెల్త్ అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను శుక్రవారం మంత్రి హరీశ్ రావు ఆవిష్కరించారు.

బెజ్జంకి(సిద్దిపేట): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతలు వెంటనే చేపట్టాలని ఎస్‌టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎస్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. అలాగే టీపీటీఎఫ్ కేలెండర్‌ను ఎంఈఓ పావని ఆవిష్కరించారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం సిద్దిపేట జిల్లా శాఖ 2023 డైరీ, కేలండర్‌ను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు.

క్రీడల్లో పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ


షీల్డ్‌లు, ప్రశంస పత్రాలు సాధించిన పెద్దకోడూరు కళాశాల విద్యార్థినులు

చిన్నకోడూరు(సిద్దిపేట): జిల్లా స్థాయి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు శుక్రవారం గజ్వేల్‌లో నిర్వహించారు. ఈ క్రీడల్లో మండల పరిధిలోని పెద్దకోడూరు మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో అత్యధికంగా షీల్డ్‌లు, ప్రశంసా పత్రాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాట్మింట్ సింగిల్‌లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థినులు అభినందించారు.

విద్యాపరంగా దుబ్బాకను అభివృద్ధి చేయాలి


మాట్లాడుతున్న దుబ్బాక డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు శ్రీకాంత్

దుబ్బాకటౌన్: విద్యారంగంలో దుబ్బాక ప్రాంతం చాలా వెనుకబడి ఉందని, విద్య పరంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని దుబ్బాక డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు మాడబోయిన శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం దుబ్బాకలో విలేకర్లతో మాట్లాడారు. దుబ్బాకలో పీజీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామిని ఇచ్చిన ఎంపీ ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దుబ్బాకలో ఉన్న డిగ్రీ కళాశాలను ఇప్పుడున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలో అన్ని వసతులు కల్పించి అందులో కొనసాగించాలన్నారు. కేసీఆర్ స్కూల్ పక్కనే ఉన్న పీఆర్, మిషన్ భగీరథ, ఇరిగేషన్ కార్యాలయాలను హబ్సీపూర్ రోడ్డులో నిర్మిస్తున్న ఐటీసీ ప్రాంగణంలోకి తరలించి ఈ స్థలాన్ని దుబ్బాక ఎడ్యుకేషన్ హబ్‌కు కేటాయించాలన్నారు. విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించేందుకు పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయాలని, అద్దె భవనంలో ఉన్న వసతిగృహానికి పక్కా భవనం నిర్మించాలన్నారు. కార్యక్రమంలో మర్గల రాజేష్, చారి, నీలకంఠ సమాజం అధ్యక్షుడు సత్యానందం, ఎల్లారం చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

వసతుల కల్పనే లక్ష్యం

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి


సీసీ రోడ్ల పనులను ప్రారంభిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో మెరుగైన వసతుల కల్పనే లక్ష్యంగా ముందుకుసాగుతున్నట్లు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళితో కలిసి సీసీ రోడ్ల నిర్మాణం పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విద్యాధర్, కౌన్సిలర్లు బాలమణి, రజిత, మెట్టయ్య, రహీమ్, బీఆర్ఎస్ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మతిన్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన వైపు మళ్లించాలి

సిద్దిపేటరూరల్: పాఠశాలలో చదువుకునే రోజుల్లోనే విద్యార్థులను పరిశోధన వైపు మళ్లించాలని తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండల పరిధి తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను విజ్ఞాన యాత్రలో భాగంగా సిద్దిపేట శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు పరిశోధన స్థానాన్ని సందర్శించారు. నీటి సంరక్షణ పద్ధతులు, నీటి కుంటలు, ప్రయోగశాల పరికరాలు, ప్రొద్దు తిరుగుడు విత్తనోత్పత్తి, వాతావరణ పరికరాలు, పంటల సస్యరక్షణ గురించి వివరించారు.

సంక్షిప్త వార్తలు

◆ టీవీ, క్రీడా సామగ్రి బహూకరణ

చిన్నకోదూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చౌడారం ప్రాథమిక పాఠశాలకు డిజిటల్ క్లాస్ నిర్వహణకు టీవీ, విద్యార్థులకు క్రీడా సామగ్రిని శుక్రవారం సర్పంచ్ అనిత బాలయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు డిజిటల్ క్లాస్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నర్సింహాచారి, ఉపాధ్యాయులు రమేశ్ రెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

◆ ఆకునూరు ఆటో యూనియన్ అధ్యక్షుడిగా చక్రధర్

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరులో శుక్రవారం ఆటో యూనియన్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నికలో భారత్ ఆటో యూనియన్ నూతన అధ్యక్షుడిగా తాటికొండ చక్రధర్, ఉపాధ్యక్షుడిగా కె.వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా ఎ.రజినీకాంత్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చక్రధర్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా భారత్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గ్రామంలో సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

◆ పేదలకు దుప్పట్ల పంపిణీ



ములుగు(గజ్వేల్): నిస్వార్థ సేవలకు ప్రతిరూపం రోటరీ క్లబ్ అని గజ్వేల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఏనుగు బాపురెడ్డి అన్నారు. ములుగు మండలం జప్తిసింగాయిపల్లి గ్రామ నిరుపేదలకు దుప్పట్లను క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కరుణాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, క్లబ్ సభ్యులతో కలసి శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండల్‌రెడ్డి, సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

◆ మెరుగైన వైద్య సేవలు అందించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామీణ ప్రజలకు మరిన్ని మెరుగైన వైద్యసేవలను అందించాలని పీహెచ్‌సీ డాక్టర్ సాయి తేజశ్విని వైద్య సిబ్బందికి సూచించారు. అక్బర్‌పేట భూంపల్లి పీహెచ్‌సీ డాక్టర్‌గా శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూంపల్లి పీహెచ్‌సీలో 24 గంటల వైద్య సేవలను అందిస్తామన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని సబ్ సెంటర్ల ద్వారా ప్రజలకు వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

◆ కల్తీనూనె వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

హుస్నాబాద్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కల్తీనూనె విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బిల్లులు లేకుండా కల్తీ నూనె తెచ్చి బహిరంగంగా అమ్ముతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

◆ వైభవంగా రుద్ర చండీయాగం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పుష్యమాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీ ఉమాపార్థీశ్వర కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రుద్ర చండీయాగం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రుద్రచండీ యాగంలో పాల్గొన్నారు.

◆ విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్ స్తంభాల మరమ్మతుల కారణంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి నర్సాపూర్ చౌరస్తా వరకు శనివారం విద్యుత్ సరఫరా ఉండదని సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్) పండరి శుక్రవారం తెలిపారు. పటేల్‌పుర, అంబేద్కర్‌నగర్, సంజీవయ్య నగర్, సాజీద్‌పుర, శంకర్‌నగర్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, బోయగల్లి పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలన్నారు.

◆ పీఎంఎస్ఆర్ఐకి 12 పాఠశాలలు ఎంపిక

దుబ్బాక: ప్రధాన మంత్రి స్కూల్స్ రైజింగ్ ఇండియా (పీఎంఎస్ఆర్ఐ)కి దౌల్తాబాద్ మండలంలో 12 పాఠశాలలు ఎంపికై నట్లు మండల విద్యాధికారి నర్సవ్వ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గాజులపల్లి, దొమ్మాట, సూరంపల్లి, ఉప్పరపల్లి, దౌల్తాబాద్ పాఠశాలలను పీఎం వెరిఫికేషన్ టీంతో కలిసి ఎంఈఓ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి బసవరాజ్, సభ్యులు లక్ష్మయ్య, రత్నాకర్ రెడ్డి, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

◆ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

దుబ్బాక: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని క్లస్టర్ రిసోర్స్ పర్సన్ గాడి రాజు అన్నారు. శుక్రవారం దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామంలో బడి బయట పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్వే నిర్వహిస్తున్నామన్నారు. 6-19 ఏళ్ల లోపు పిల్లలు బడిలోనే ఉండాలని ప్రభుత్వం ఉద్దేశమన్నారు.

◆ కార్యకర్తల కుటుంబానికి పరామర్శ

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబాన్ని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మాదాసు శ్రీనివాస్‌లు పరామర్శించారు. మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కాసమొల్ల శేఖర్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న మాదాసు శ్రీనివాస్, బెండ మధులు శుక్రవారం పరామర్శించి సంతాపం తెలిపారు.

◆ రామక్కపేట మెడికల్ ఆఫీసర్‌గా హిమబిందు

దుబ్బాకరూరల్: మండలంలోని రామక్కపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్‌గా జి.హిమబిందు బాధ్యతలు చేట్టారు. ఇక్కడ మెడికల్ ఆఫీసర్‌గా కార్తీక్ పనిచేశారు. ఈయన బదిలీపై హైదరాబాద్ కార్థాన అర్బన్ సీహెచ్‌సీకి వెళ్లారు.

◆ జీపీపీ డీఎంగా బాధ్యతల స్వీకరణ

గజ్వేల్‌రూరల్: జీపీపీ(గజ్వేల్-ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్ హయత్‌నగర్ డిపోకు బదిలీపై వెళ్లాడు. ఆయన స్థనంలో షాద్‌నగర్ ఆర్టీసీ డిపో నుంచి బదిలీపై వచ్చిన సురేఖ శుక్రవారం జీపీపీ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్తున్న శ్రీనివాస్, బాధ్యతలు స్వీకరించిన సురేఖలను ఉద్యోగులు, సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీపీపీ డిపో ఉద్యోగులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నార

◆ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం రిష్కరించాలని అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ ఒగ్గు రమేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా ఏఐపీఎస్‌యూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ చైర్మన్‌కు ఆహ్వానం

సిద్దిపేటజోన్: ఈనెల 8వ తేదీన జరగనున్న జిల్లా పద్మశాలి సమాజ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకావాలని ప్రతినిధులు మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్స్‌కు ఆహ్వాన పత్రికను అందచేశారు. శుక్రవారం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సతీష్, ప్రతినిధులు కలిశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు మల్లికార్జున్, యోగి, నాగరాజు తదితరులు ఉన్నారు.

◆ కనుల పండువగా తిరుప్పావై ప్రవచనాలు

గజ్వేల్‌రూరల్: టీటీడీ ఆధ్వర్యంలో ధనుర్మాస ఉత్సవంలో భాగంగా నిర్వహించిన తిరుప్పావై ప్రవచనాలు కనుల పండువగా జరిగినట్లు గజ్వేల్ శ్రీలక్ష్మీ వెంకటేశ్వర దేవాలయ ప్రధానార్చకుడ శేషం శ్రీనివాసాచార్యులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ హయత్‌నగర్‌లోని కుంట్లూరులోని యాజ్ఞికపీఠం భరద్వాజాశ్రమ ఆలయంలో టీటీడీ వారిచే ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం పూర్ణిమను పురస్కరించుకొని నిర్వహించిన శ్రీసుదర్శనయాగం, పూర్ణాహుతి నిర్వహించామన్నారు.

